క్లుప్తంగా

కుంకుమార్చన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వెంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవికి విశేష అభిషేకాలు, అర్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మహిళలు ఆలయానికి చేరుకుని సామూహికంగా లలితా సహస్ర నామ పారాయణం చేశారు. పసుపు, కుంకుమ, దీపాలు, నైవేద్యంతో భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శివ దీక్ష బృందం భిక్షాటన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి శివదీక్ష బృందం ఆధ్వర్యంలో బుధవారం భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 23 ఏళ్లుగా ప్రతి ఏడాది శివదీక్ష బృందం ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని భక్తులు తెలిపారు. దారి వెంబడి భక్తులు ధన, ధాన్య, వస్తు రూపంలో స్వామి వారికి కానుకలు సమర్పించారు. ఈ భిక్షాటనలో వచ్చిన మొత్తాన్ని అన్నదాన కార్యక్రమం, హోమాలకు వినియోగిస్తామని తెలిపారు. ఈ భిక్షాటన కార్యక్రమం రామేశ్వరం, గాంధీ రోడ్డు మీదుగా శివాలయం వరకు సాగింది.

హాస్టళ్లు తనిఖీ

పోరుమామిళ్ల : పట్టణంలోని వివిధ ప్రభుత్వ హాస్టళ్లలో భద్రత గురించిన వివరాలు తెలుసుకునేందుకు మంగళవారం రాత్రి సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి సిబ్బందితో హాస్టళ్లను సందర్శించారు. హాస్టళ్లలో సీసీ కెమెరాల గురించి విచారించారు. వాచ్‌మెన్‌ల పరిస్థితి ఆరా తీశారు. రాత్రిళ్లు జాగ్రత్తగా ఉండాలని, నేరాలు జరగకుండా చూసుకోవాలని హెచ్చరించారు. అవసరమైన సహాయం కొరకు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన మాలమహానాడు నూతన కార్యవర్గం

ప్రొద్దుటూరు : స్థానిక ఎన్జీఓ హోంలో బుధవారం మాలమహానాడు (జి.చెన్నయ్య వర్గం) కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జేష్టాది భాస్కర్ ఆధ్వర్యంలో మండల, జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షుడిగా జె.మధుబాబు, పట్టణ అధ్యక్షుడిగా జె.పవన్, పట్టణ మహిళా అధ్యక్షురాలుగా సింహం శాంతమ్మ, పట్టణ గౌరవ అధ్యక్షుడుగా దియా సుధాకర్, యూత్ ప్రెసిడెంట్‌గా జె.స్వరూప్, పట్టణ గౌరవ ఉపాధ్యక్షుడిగా జె.సన్నా, కడప జిల్లా జనరల్ సెక్రటరీగా ఎర్రమాసు సునీల్, జిల్లా జాయింట్ సెక్రటరీగా జి.చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు. వీరికి జిల్లా అధ్యక్షుడు భాస్కర్ కండువాలను వేసి నియామక పత్రాలను అందించారు. శ్రీపతి భాస్కర్, కొత్త మాస్ రాబర్ట్, విజయ్, పి.ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ విజయ్ మంగళవారం మోటారు బైక్ ప్రమాదంలో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి బుధవారం వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు.

హామీలను అమలు చేయాలి

ప్రొద్దుటూరు రూరల్ : ఎన్నికల సమయంలో ముస్లింలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం అమలు చేయాలని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇమాం, మౌజన్‌లకు గౌరవ వేతనం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలన్నారు. మసీదుల్లో ప్రార్థనలు చేసే ఇమాంలకు రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.5 వేలు వేతనం ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. 11 నెలల నుండి ఇమాం, మౌజన్లకు వేతనాలు అందడం లేదన్నారు. ఆవాజ్ కమిటీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, నాయకులు మహ్మద్ రసూల్, అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

పోరుమామిళ్ల : ఇటీవల హైదరాబాదులో జరిగిన జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని బొల్లు సాయిప్రీతి రజత పతకాన్ని సాధించింది. ఈ నెల కాకినాడలో జరిగిన ఎన్టీఆర్ రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణపతకం సాధించింది. 20 రోజుల్లో జాతీయ పోటీల్లో రజత పతకం, రాష్ట్ర పోటీల్లో స్వర్ణపతకం సాధించిన సాయిప్రీతిని బుధవారం ప్రిన్సిపాల్ శామ్యూల్ డేవిడ్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు అభినందించారు.

ఆర్థికసాయం

బద్వేలు అర్బన్ : కుటుంబ పెద్దను కోల్పోయిన నిరుపేద యాదవ కుటుంబానికి కువైట్ యాదవ సంఘం అండగా నిలిచింది. అనంతరాజుపురం పంచాయతీ విజయరామాపురానికి చెందిన రాగె వెంకటనరసయ్య ఇటీవల మృతి చెందాడు. కుటుంబ పోషణ భారమైన విషయం తెలుసుకున్న కువైట్ యాదవ సంఘం అధ్యక్షుడు చల్లా బాబుయాదవ్ వెంకటనరసయ్య కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని పంపించారు. నియోజకవర్గ అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు బుర్రి రాజాయాదవ్ లక్ష్మిదేవికి నగదును అందజేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రెండో రోజు బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు 36 జీఓను అమలు చేసి వేతనాలను పెంచాలని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల అర్హతను బట్టి స్కిల్, సెమిస్కిల్ వేతనాలను ఇవ్వాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శానిటేషన్ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులుగా విడదీసి వేతనాలను ఇచ్చిందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగిస్తామని క్యాబినెట్‌లో తీర్మానం చేశారన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.విజయకుమార్, పట్టణ కార్యదర్శి సాల్మన్, పట్టణ అధ్యక్షుడు చంటి, ఉపాధ్యక్షురాలు గురమ్మ, కోశాధికారి రాఘవేంద్ర, నాగేంద్ర, బీటెక్ శివ, వెంకటేశులు, గుర్రప్ప, గంగాధర్‌రెడ్డి, గౌడ్, మహమ్మద్, బాలాజీ, శ్రీను కార్మికులు పాల్గొన్నారు.

బద్వేలులో..

బద్వేలు అర్బన్ : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రబాబులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 123 నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఇంజనీరింగ్ విభాగాలైన మంచినీటి, వీధిదీపాల నిర్వహణ, టౌన్‌ప్లానింగ్ తదితర విభాగాల్లో దాదాపు 13 వేల మంది కార్మికులు సుమారు 20 నుండి 25 ఏళ్ళుగా ప్రజలకు సేవలందిస్తున్నారని, వీరికి 2018 వరకు పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లిస్తుండేవారని, ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికుల కంటే తక్కువ వేతనాలు చెల్లిస్తుండటంతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచడంతో పాటు నిత్యం ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రిస్క్ అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యాంప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, సీఐటీయూ పట్టణ నాయకుడు రాయప్ప, ఇంజనీరింగ్ కార్మికులు ప్రసాద్, నరసయ్య, ఆదినారాయణ, నాగసుబ్బారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి బాగుంటేనే అందరూ బాగుంటారు



సామూహిక తులసీ పూజను నిర్వహిస్తున్న మహిళలు

మైదుకూరు : ప్రకృతి బాగుంటేనే అందరూ బాగుంటారని శ్రీ అచలానంద పీఠాధిపతి శ్రీ విరజానంద స్వామి అన్నారు. మైదుకూరులో బుధవారం సాయంత్రం హిందూ సంఘాలు, రాష్ట్రీయ సేవక సమితి ఆధ్వర్యంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని మహా హారతి కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో మహిళలు సామూహిక తులసి పూజను నిర్వహించారు. అనంతరం విరజానంద స్వామి మాట్లాడుతూ హిందువులు ప్రకృతిని ఆరాధిస్తారని పేర్కొన్నారు. దీపం సమాజానికి వెలుగును ఇస్తుందని, సామూహిక హారతి సందేశం అదేనన్నారు. తులసీ మాత ఆరాధన వల్ల కుటుంబంలో సౌభాగ్యం కలుగుతుందని తెలిపారు. ముందుగా ద్వార పూజ, అనంతరం సామూహిక తులసి పూజ చేయాలని సూచించారు. కులాల పేరుతో వర్గాల పేరుతో వైషమ్యాలున్నా అందరూ హిందువులమే అన్న భావనతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈశ్వరీదేవి మఠాధిపతి శివకుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని బొక్కేస్తున్న మీరు నీతులు చెప్పడమా?

- మీ నాయకుడు సాగు చేసుకుంటున్న దేవుని మాన్యానికి పైసా అయినా చెల్లించారా
- టీడీపీ నాయకుల ఆరోపణలను తిప్పికొట్టిన వైఎస్సార్‌సీపీ మండల నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఖాజీపేట : నాగనాథేశ్వర స్వామి ఆలయ భూములను అనుభవిస్తూ ఒక్క పైసా డబ్బు ఎండోమెంట్‌కు చెల్లించకుండా ఉన్న టీడీపీ నాయకులు నేడు వైఎస్సార్‌సీపీ నాయకులకు నీతులు చెప్పడం చూస్తే సిగ్గుపడాల్సి వస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డిలు అన్నారు. ఖాజీపేటలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నాగనాథేశ్వర కొండ దేవుని మాన్యం సర్వేనంబర్ 493లో 7.30 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమిని రావులపల్లె టీడీపీ నాయకుడి చిన్నాన్న సాగు చేసుకుంటున్నారని చెప్పారు. ఆ భూమి గుత్తలో ఒక్క పైసా అయినా ఇప్పటి వరకు ఎండోమెంట్‌కు చెల్లించారా అని వారు ప్రశ్నించారు. రేషన్ పంపిణీలో డీలర్లు రెండు కేజీలు బియ్యం తక్కువ అందజేయడంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. దానిపై కొందరు టీడీపీ నాయకులు అనవసర విమర్శలు చేస్తుండటాన్ని తప్పుబట్టారు. రావులపల్లె డీలర్ జనవరి నెలలో రాజీనామా చేసి ఎలాంటి బ్యాక్‌లాగ్ లేకుండా టీడీపీ వారికి అప్పజెప్పగా గత నెలలో 26 క్వింటాళ్ల 82 కేజీలను బ్యాక్‌లాగ్ ఉన్నట్లు చూపించారన్నారు. అంటే మీ ప్రభుత్వంలోనే బ్యాగ్‌లాగ్ వచ్చిందని స్పష్టం చేశారు. పురుగులు పట్టిన జొన్నలు ఇస్తున్నారని ఇవి పశువులు కూడా తినవని ఎద్దేవా చేశారు. చేతనైతే కేజీ బియ్యం పట్టుకోకుండా కార్డుదారులకు నాణ్యమైన రేషన్ ఇవ్వండి అంతే కానీ ఇలా అనవసర విమర్శలు చేసి అబాసుపాలుకావద్దని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్గనైజర్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, సర్పంచ్‌లు సుబ్బారెడ్డి పత్తూరు ఎంపీటీసీ రాముడు, రామకృష్ణారెడ్డి, వెంకటశివారెడ్డి, అంబటి శివారెడ్డి, రమణ పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటించిన కమిషనర్



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బుధవారం మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున పర్యటించారు. స్థానిక ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్ చుట్టూ చెత్త ఎక్కువగా ఉందని సమస్యను తెలపగా కమిషనర్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. పారిశుధ్య కార్మికులతో చెత్తను శుభ్రం చేయించారు. శ్రీరాములపేటలోని శిల్పకళా కల్యాణ మండపం వెనుక కాలువలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించాలని శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రెస్ క్లబ్ వద్ద ఉన్న కాలువలో సిల్ట్‌ను కార్మికులతో తొలగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వి.సుబ్బరాయుడు, ఎస్.నూర్ బాషా పాల్గొన్నారు.

రైతుల మనోభావాలను కించపరచలేదు

ప్రొద్దుటూరు రూరల్ : వేంపల్లె– చాగలమర్రి నేషనల్ హై వే 440 భూ నిర్వాసితుల మనోభావాలను కించపరిచేలా తాను మాట్లాడలేదని తహసీల్దార్ గంగయ్య తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం వేంపల్లె–చాగలమర్రి జాతీయ రహదారి భూ సేకరణపై కొత్తపల్లె పంచాయతీ సచివాలయంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో నష్టపరిహారం గురించి చర్చించే సమయంలో ఓ వ్యక్తి ఆవేశంగా ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం పప్పులు, బెల్లం కొనడానికి కూడా సరిపోదని వాదించాడన్నారు. అందుకు తాను అంత దీనాదీనంగా పప్పులు, బెల్లం అన్న పదాలను వాడకూడదని, నష్టపరిహారం పెంచమని అడిగే విధానం ప్రకారం అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పానే తప్ప ఎవరినీ కించపరిచే ఉద్దేశం కాదన్నారు. సభ ప్రశాంతంగా జరిగే విధంగా తాను వ్యవహరించానన్నారు.

తిప్పిరెడ్డిపల్లెలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే

చాపాడు : మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పర్యటించారు. ఇదే క్రమంలో గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు లోమడ ఉమామహేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డిల సోదరుడు సుబ్బారెడ్డి కుమార్తె కావేరి వివాహం గురువారం జరుగనుంది. ఈ మేరకు ముందస్తుగా కావేరిని ఆశీర్వదించారు. అనంతరం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమావేశమై రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, వెంకట్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గంగురాజు, జయసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉపయోగపడని పెద్దాసుపత్రి ఎందుకు..?

ప్రొద్దుటూరు క్రైం : పేదలకు ఉపయోగపడని పెద్దాసుపత్రి ఎందుకని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఇర్ఫాన్‌బాషా ప్రశ్నించారు. బుధవారం ఆయన జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఎమ్మార్ఐ, సిటి స్కాన్ విభాగాలను పరిశీలించారు. గత ఐదు రోజుల నుంచి ఆస్పత్రిలోని వైద్యులు ఎమ్మార్ఐ, సిటి స్కాన్‌లను సూచించడం లేదన్నారు. అవసరం ఉన్నా కూడా వైద్యులు సిటి, ఎమ్మార్ఐ స్కాన్‌లు రాయడం లేదన్నారు. సర్జన్‌లే స్కానింగ్‌లను రెఫర్ చేయాలని నిబంధన విధించడం మంచిది కాదన్నారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుతో ఇర్ఫాన్‌బాషా మాట్లాడారు.

రాయితీతో స్కానింగ్, రక్తపరీక్షలు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని కల్యాణి కిడ్నీకేర్ హాస్పిటల్ (సూపర్ స్పెషాలిటి కిడ్నీకేర్ సెంటర్) మొదటి వార్షికోత్సవం సందర్భంగా సాయికుటీర్ రోడ్డులోని తమ హాస్పిటల్‌లో ఈ నెల 14,15,16 తేదీల్లో ఉచితంగా ఓపీ నిర్వహించనున్నట్లు వైద్యులు కె నరేంద్రారెడ్డి, సి కల్యాణిలు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 50 శాతం రాయితీతో రక్తపరీక్షలు, రాయితీతో అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయనున్నట్లు చెప్పారు. ప్రొద్దుటూరు, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

నేడు ఉపాధి పనులపై ఓపెన్ ఫోరమ్

కాశినాయన : మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం ప్రతి ఇంటికి వెళ్ళి వివరాలు సేకరించారు. దీనిపై గురువారం మండల పరిషత్ సభాభవన ఆవరణలో జిల్లా డ్వామా అధికారుల సమక్షంలో ఓపెన్ ఫోరమ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. ఈ సమావేశానికి ఉపాధి అధికారులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు తమ నివేదికలతో హాజరు కావాలన్నారు.

డిప్యూటీ ఈఓపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : స్థానిక డిప్యూటీ ఈఓ మీనాక్షిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. స్థానిక డిప్యూటీ ఈఓ కార్యాలయం వద్ద ఆయన బుధవారం మాట్లాడుతూ డిప్యూటీ ఈఓ సమయపాలన పాటించడం లేదని, ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియడం లేదన్నారు. ఆఫీసులో ఎటువంటి మూమెంట్ రిజిస్టర్ నిర్వహించడం లేదని ఇక్కడి సిబ్బంది చెబుతున్నారన్నారు. డివిజన్ పరిధిలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. డిప్యూటీ ఈఓపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జ్యోతినగర్‌లో పేకాట ఆడుతున్న పది మందిని త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జ్యోతి నగర్‌లోని ఖాళీ స్థలంలో పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి, సిబ్బందితో కలసి బుధవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.50,520 నగదు స్వాధీనం చేసుకున్నారు.

నివాళి

బద్వేలు అర్బన్ : మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి మాతృమూర్తి పెద్దకర్మ సందర్భంగా బుధవారం పంగావాండ్లపల్లెలో ఆమె చిత్రపటానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన గొప్ప మాతృమూర్తి తులసమ్మ అని కొనియాడారు.

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు



శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

పోరుమామిళ్ల : పట్టణంలోని పురాతన శివాలయం శ్రీ బాలాత్రిపురసుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం సూర్యకిరణాలు శివలింగాన్ని తాకాయి. సమాచారం తెలియడంతో భక్తులు భారీగా తరలివచ్చి స్వామికి రుద్రాభిషేకం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సత్యనారాయణరెడ్డి, అర్చకులు మధుస్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శివరాత్రికి ముందు సూర్యభగవానుడు శివరాత్రి సూచనగా శివలింగంపై తన కిరణాలు ప్రసరింపచేస్తాడన్నారు. ఇది ఆనవాయితీగా వస్తున్నదన్నారు.

ఘనంగా చండీ హోమం



హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వర స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, గణపతి, నవగ్రహ, చండీ హోమాలను వేద పండితులు నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ ఈఓ రామచంద్రాచార్యులు, వేద పాఠశాల గురువు, శిష్య బృందం, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ ప్రారంభం



ఆలయ ప్రహరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, నాయకులు

బద్వేలు అర్బన్ : మండలంలోని గొడుగునూరు గ్రామంలోని పోలేరమ్మ తల్లి ఆలయంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దపోలిరెడ్డి, సర్పంచ్ జయరామిరెడ్డిల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ప్రహరీగోడను బుధవారం ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, ఆయా పంచాయతీల ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ

బద్వేలు అర్బన్ : అంగవైకల్యం, చెవిటి, మూగ ఇతర సమస్యలతో బాధపడుతున్న సంవత్సరంలోపు పిల్లలను గుర్తించేందుకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమైన సర్వేను అంకితభావంతో చేపట్టి విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ తెలిపారు. బుధవారం కోర్టు హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంటింటికి వెళ్ళి విభిన్న ప్రతిభావంతులను గుర్తించడం ద్వారా వారిని జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని డీఈఐసీ సెంటర్‌కు పంపి సకాలంలో వైద్య పరీక్షలు అందించేందుకు ఈ సర్వే దోహదపడుతుందని తెలిపారు. ఈ సర్వేకు 25 మంది కోర్టు పారాలీగల్ వలంటీర్లను నియమించడం జరిగిందని, వారికి అంగన్‌వాడీ వర్కర్లు, స్త్రీశిశు సంక్షేమశాఖ సిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, సీహెచ్ఓలు, సచివాలయ సిబ్బంది సహకరించాలని కోరారు. సర్వే చేసే సిబ్బంది సంబంధిత డీఈఐసీ హెల్త్ సెంటర్ వైద్యుల ఫోన్‌నెంబర్ కూడా అందజేయాలని కోరారు. సంవత్సరంలోపు చిన్న పిల్లలు ఆయురారోగ్యాలతో అంగవైకల్యం లేకుండా ఎదగాలనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న ఈ సర్వే ఈ నెల 24వ తేదీ వరకు జరుగుతుందని, ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు.

ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య



రైతులకు రిజిష్టర్ చేస్తున్న వ్యవసాయ అధికారి

అట్లూరు : స్వంత భూమి కలిగిన ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించడం జరుగుతుందని అందుకు ప్రతి రైతు రిజిష్టర్ చేసుకోవాల్సి ఉంటుందని బద్వేలు వ్యవసాయ అధికారి కల్లూరి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం బద్వేలు మండల పరిధిలోని కొంగలవీడు రైతు సేవా కేంద్రంలోని పలువురు రైతులకు ఆయన విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిష్టర్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై రైతులకు ప్రభుత్వ రాయితీతో పాటు పీఎం కిసాన్ తదితర ప్రభుత్వ పథకాలు పొందాలంటే ప్రతి రైతు రైతు సేవా కేంద్రంలో రిజిష్టర్ చేసుకోవచ్చన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



డివిజన్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న ఏపీఈఈయూ 1104 యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ఏపీఈఈయూ 1104 యూనియన్ కృషి చేస్తున్నట్లు రీజనల్ ప్రెసిడెంట్ యూఎస్‌కే బార్నబాస్, డివిజనల్ ప్రెసిడెంట్ సి.మాధవ తెలిపారు. ఏపీఈఈయూ 1104 యూనియన్ 75వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరై భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సు కోసం నాటి నుంచి నేటి వరకు తమ యూనియన్ ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించిందన్నారు. కార్యక్రమంలో డివిజనల్ కార్యదర్శి ఎస్.షరీఫ్, డివిజనల్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు, నాయకులు ఎం.రేణుక రెడ్డి, ఎస్ గఫూర్, జె.జయకృష్ణ, జి.మారెన్న, కె.శివప్రసాద్‌తోపాటు ప్రాణదాత సేవా సమితి సభ్యులు సూర్యనారాయణరెడ్డి, శివారెడ్డి, నారాయణరెడ్డి, మునయ్య, దేగల సునీల్, లాయర్ సుమంత్, రాజు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ

ఏపీఈఈయూ 1104 ప్లాటినం జూబ్లీ వేడుకల సందర్భంగా స్థానిక వూటుకూరు వీరయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. ప్యాడ్, పెన్ను తదితర వస్తువులను 54 మంది విద్యార్థులకు అందించారు. అనంతరం విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద యూనియన్ నాయకులు జెండాను ఆవిష్కరించారు.

గ్రామసభల్లో ఇచ్చిన అర్జీలకు పరిష్కారమెప్పుడు?



జేసీ, ఆర్డీఓలకు తమ గోడును వినిపిస్తున్న అర్జీదారులు



తహసీల్దారు కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

జేసీ, ఆర్డీఓలను ప్రశ్నించిన అర్జీదారులు

బి.కోడూరు : రీసర్వే రికార్డులను పరిశీలించడానికి, అర్జీల పరిశీలన కోసం బుధవారం మండలంలోని తహసీల్దారు కార్యాలయానికి జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్‌లు వచ్చారు. కామకుంట, వేమకుంట, మాధవరాయునిపల్లె, తిప్పరాజుపల్లె, పెద్దుళ్ళపల్లె గ్రామాల ప్రజలు కలిసి ఇటీవల జరిగిన గ్రామసభల్లో భూ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చామని, అవి ఏమయ్యాయని, వాటి పరిష్కారమెప్పుడని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికే 5, 6 సార్లు అర్జీలు ఇవ్వడం తప్ప పరిష్కారమైంది లేదని, ఇటీవల జరిగిన రెవెన్యూ గ్రామసభల్లోనైనా భూ సమస్యలు పరిష్కారమవుతాయని గంటల కొద్దీ వేచి ఉండి అర్జీలు సమర్పించామని, కానీ అవి ఏమయ్యాయో ఇంత వరకు తెలియలేదని వారు జేసీని ప్రశ్నించారు. అంతేకాకుండా 2006 నుండి సాగు చేసుకుంటూ రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉన్న వాటిని కూడా కావాలనే కొంత మంది అధికారులు రీసర్వే పేరుతో ఆన్‌లైన్‌లో తొలగించి తమకు తీవ్ర అన్యాయం చేశారని, దీనిమూలంగా సుమారు 300 మందికి పైగా రైతులు నష్టపోతున్నామని తెలిపారు. స్వయంగా గ్రామాల్లోకి వచ్చి భూములను పరిశీలించి ఏవైనా భూములపై సమస్యలు ఉంటే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అంతేగాని వారసత్వంగా గత 20 ఏళ్ళు సాగు చేసుకుంటూ అనుభవించుకుంటున్న భూములను తొలగించడం వలన బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసేందుకు కూడా వీలు లేకుండాపోయిందని, దీంతో బ్యాంకులకు వడ్డీలకు వడ్డీ చెల్లించాల్సి వస్తుందని, వీటన్నింటిపై దృష్టి సారించి స్వయంగా రికార్డులను పరిశీలించి గ్రామాల్లో పర్యటించి తగు న్యాయం చేయాలని వారు జేసీ, ఆర్డీఓలకు విజ్ఞప్తి చేశారు. జేసీ స్పందిస్తూ త్వరలో మరలా రికార్డులను పరిశీలించి అర్హులైన వారందరికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.